క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ ఆర్ఎం'

పట్నంబజారు: ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు ఆర్ఎం కార్యాలయ సిబ్బంది మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఆర్ఎం రవికాంత్ ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడంతోపాటు, వారి సూచనలు స్వీకరిస్తారని తెలిపారు. ఫోన్ చేయదలచిన వారు 9959225412కు ఫోన్ చేయాలని సూచించారు.

మట్టి ప్రమిదలు వాడుదాం..

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ మురళీకృష్ణ
నేడు 40వేల ప్రమిదల పంపిణీకి ఏర్పాట్లు



కొరిటిపాడు(గుంటూరు): దేశంలో అతిపెద్ద పండుగలలో పిల్లలు, పెద్దలు అందరూ జరుపుకునే పండుగల్లో దీపావళి ముఖ్యమైనదని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. చెడు మీద మంచి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే ఈ దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణానికి హానిచేసే రసాయన మిళితమైన కొవ్వొత్తులు, వివిధ రకాల బాణసంచాలు వదిలి పర్యావరణ హితంగా ఈ దీపావళి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. బుధవారం(నేడు) పట్టాభిపురంలోని గ్రీన్ గ్రేస్ కాంపౌండ్ వద్ద 40 వేల మట్టి ప్రమిదలను నగర ప్రజలకు ఉచితంగా పంపిణీచేయనున్నట్లు తెలిపారు. నగర ప్రజలకు ఈ సందర్భంగా ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

అనధికార బోర్ వెల్స్ సీజ్‌కు సిఫార్సులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అనధికారికంగా బోర్ వెల్స్ నిర్వహిస్తూ, నీటి విక్రయాలు చేస్తున్న బోర్ వెల్స్‌ని సీజ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని గుంటూరు పశ్చిమ, తూర్పు ఎమ్మార్వోలకు లేఖలు పంపామని, అటువంటి బోర్ వెల్స్‌కి విద్యుత్ కనెక్షన్ కూడా తొలగించాలని సీపీడీసీఎల్ ఎస్ఈకు లేఖ పంపామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగర పరిధిలోని గోరంట్ల, రెడ్డిపాలెం, నల్లపాడు, చౌడవరం, పొత్తూరు, అంకిరెడ్డిపాలెం, పెద్ద పలకలూరు చుట్టూ పక్కల ప్రాంతాల్లో అనధికారికంగా బోర్లు వేసి, శక్తివంతమైన మోటార్ల ద్వారా నీటిని తోడి ట్యాంకర్ల ద్వారా విక్రయాలు చేయడం వలన పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు లేక స్థానిక ప్రజలు పలుమార్లు జీఎంసీకి ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ప్రజా ఫిర్యాదుల మేరకు, గుంటూరు పశ్చిమ, తూర్పు తహసీల్దార్‌లకు వాల్టా చట్టం ప్రకారం నగర పరిధిలో అనధికార బోర్స్ ద్వారా నీటిని విక్రయాలు చేస్తున్న ప్లాంట్‌లను సీజ్ చేయాలని, అటువంటి ప్లాంట్‌లకు విద్యుత్ కనెక్షన్ తొలగించాలని సీపీడీసీఎల్ ఎస్ఈకి సిఫార్సు చేశారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

నెహ్రూనగర్: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న ఓటర్లు నిర్దేశిత డాక్యుమెంట్స్ అప్ లోడ్ చేయాలని, లేకుంటే క్షేత్ర స్థాయి పరిశీలనలో దరఖాస్తుదారుని చిరునామా వివరాలు సక్రమంగా లేకుంటే బీఎల్ఓలు దరఖాస్తుని రిజెక్ట్ చేసే అవకాశం ఉందని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటర్‌గా అర్హత కలిగిన వారు ఆన్‌లైన్‌లో ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసే సమయంలో తమ చదువు, చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలు సమగ్రంగా నమోదు చేయడంలేదని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ఓట్ల పరిశీలనకు బీఎల్ఓలు వస్తారని, వారికి అందిన దరఖాస్తుల్లో సమగ్రంగా వివరాలు లేకుంటే సదరు దరఖాస్తు రిజెక్ట్ చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎన్నికలకు సంబంధించిన ఓటు దరఖాస్తులు ఇవ్వడం, తీసుకోవడానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



లక్ష్మీపురం: ఈనెల 31వ తేదీ నాటికి ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు పిలుపునిచ్చారు. కొత్తపేటలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కొరకు 44 కార్మిక చట్టాలను సాధించిన ఘనత ఒక్క ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్న ఈ తరుణంలో రానున్న రోజుల్లో కార్మికులందరూ ఏకమై బీజేపీకి ఓటు ద్వారా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ మాట్లాడారు.



అరండల్‌పేటలోని ఒక వైన్స్ వద్ద పరిస్థితి ఇలా...

మందేసి.. చిందేయ్..

- నడిరోడ్డుపై మద్యం తాగుతున్న మందు బాబులు
- అడ్డూఅదుపు లేకుండా దుకాణాల వద్ద దందా
- కనీసం కన్నెత్తి చూడని పోలీసులు
- గుడి..బడి అనే విజ్ఞత లేకుండా విచ్చలవిడిగా..

అంతా బహిరంగంగానే..



అరండల్‌పేట రైల్వేస్టేషన్ ఎదుట రోడ్డుపై మద్యం తాగుతున్న మందుబాబులు

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మందుబాబుల విన్యాసాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. నడిరోడ్డుపై యథేచ్ఛగా మద్యం తాగుతున్నా.. కనీసం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. గుడి.. బడి అనే విజ్ఞతను మరిచి మరీ.. మద్యం తాగుతున్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదు..

గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో మొత్తం ఇటీవల కాలంలో వైన్‌షాప్‌లకు అనుమతులు వచ్చాయి. ఈస్ట్‌లో 14 ఉండగా, వెస్ట్ 19 వైన్స్‌లు, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఈస్ట్‌లో 34, వెస్ట్ 34 కలిపి మొత్తం 68 ఉన్నాయి. అరండల్‌పేట 1వలైనులో రైల్వేస్టేషన్ ఎదురుగా ఒక వైన్ షాప్ ఉంది. అయితే మందు బాబులు అక్కడే యథేచ్ఛగా పక్కనే ఉన్న తోపుడు బండ్లు, ద్విచక్ర వాహనాలపై మద్యం తాగుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి ఉన్నా.. కనీసం అడిగే నాథుడే లేకుండాపోయాడు. పక్కనే గుర వయ్యా హైస్కూల్ పాఠశాల ఉంది. ఆఖరికి మద్యం మత్తులో దేవుడు అనే విషయాన్ని మరచి, పక్కనే ఉన్న సాయిబాబా ఆలయం వద్ద గట్టుపై మద్యం పెట్టుకుని తాగేస్తున్నారంటే దుస్థితి అర్థం చేసుకోవచ్చు. అదే అరండల్‌పేటలోని 1వలైనులో ఒక వైన్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అక్కడ అయితే నేరుగా బహిరంగంగానే మద్యం తాగి, గ్లాసులు పడేసేందుకు టబ్బులు ఏర్పాటు చేసిన పరిస్థితి. పక్కనే నివాసాల ముందు అరుగులపై మందు పెట్టుకుని లాగించేస్తున్నారు. జేకేసీ కళాశాల రోడ్డులో ఉన్న ఒక వైన్‌షాప్ దగ్గర అయితే.. అక్కడి రోడ్డంతా మందు బాబుల కోసమే కేటాయించినట్లు పట్టపగలే రోడ్డుపై కూర్చుని తాగుతున్నారు. చిలుకలూరిపేట రోడ్డులో సాయంత్రం 7గంటల తరువాత చూస్తే.. ద్విచక్ర వాహనాలపై యువకులు బారులు తీరి.. మద్యం, బీర్‌లు తాగిస్తున్న దృశ్యాలు కొకొల్లలు కనపడతాయి. ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ సర్కిల్‌లోనూ ఇదే పరిస్థితి.

యారక్.. మోజులో పడి...

బహిరంగ మద్యం పానాన్ని అరికట్టాల్సిన పోలీసులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై యథేచ్ఛగా అదే తంతు నిత్యం కొనసాగుతున్నా.. అటు వైపు నుంచే రక్షక్, అధికారి వాహనాలు వెళుతున్నా.. ఇదేమని ప్రశ్నించటం మరిచి పోయినట్టున్నారు. ప్రతి నెల యారక్‌లు రూ.15 వేలకు పైగా వైన్, బార్ అండ్ రెస్టారెంట్‌ల నుంచి వస్తున్నట్లు సమాచారం. అందుకే తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనలకు నీళ్లు..

కూటమి సర్కార్ వైన్ షాపుల ఏర్పాటు అంశంలో నిబంధనలు పట్టించుకోవడం లేదు. గుడి, బడి, ఆస్పత్రికి వంద మీటర్ల దూరంలో బార్, వైన్స్‌లు ఉండకూడదన్న నిబంధనలకు పక్కన పెట్టేశారు. అరండల్‌పేట రామాలయం ఎదురుగా ఒక వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్‌లు ఉన్నాయి. రైల్వేస్టేషన్ దగ్గర ఉన్న వైన్ సమీపంలోనే గురవయ్య హైస్కూల్, సాయిబాబా ఆలయం ఉన్నాయి. అయినప్పటికీ నిబంధనలు ఏమి పట్టకుండా, వైన్ షాపులను ఏర్పాటు చేశారు.



ఆలయం పక్కనే మద్యం కొలతలు వేసుకుంటున్న మందుబాబులు

గత ప్రభుత్వంలో...

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్న సమయంలో బహిరంగ మద్యపానంపై ఉక్కుపాదం మోపారు. కేవలం గుంటూరు జిల్లా పరిధిలో 40 వేలకుగాపై కేసులు నమోదు చేశారంటే.. పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మద్యం కొనుగోలు చేసినా.. అక్కడ తాగేందుకు ప్రభుత్వ దుకాణాల వద్ద ఏ మాత్రం అనుమతి ఉండేది కాదు. ఇప్పుడు ప్రైవేటీకరణ చేయటం, దుకాణదారులకు ప్రభుత్వ పెద్దల అండదండలు ఉండటంతో పేట్రేగిపోతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బహిరంగ మద్యం పానం కేసులు వేళ్ల మీద లెక్కవచ్చని పోలీసులే చెబుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



బహిరంగ మద్యపానం చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కచ్చితంగా ఆయా స్టేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేస్తాం. ప్రజలకు ఏదైనా ఇబ్బంది ఉంటే నా దృష్టికీ తీసుకుని రావచ్చు. రోడ్లపై తాగి ఘర్షణలకు దిగితే కేసులు నమోదు చేస్తాం.

–సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు జిల్లా

ప్రధాన రహదారులకు ప్యాచ్ వర్క్స్ చేపట్టాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగరంలోని ప్రధాన రహదారుల్లో ప్యాచ్ వర్క్స్, వీధి దీపాల నిర్వహణను ఇంజినీరింగ్ అధికారులు నిరంతర ప్రక్రియగా చేపట్టాలని, ప్రతి రోజు ఆయా అంశాలపై సమీక్ష చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇంజినీరింగ్ అధికారులు, నూతనంగా విధులు కేటాయించబడిన అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత నూతనంగా విధులు కేటాయించబడిన అధికారులతో మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వీధి దీపాలపై ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందుతున్నాయని, 24 గంటల్లో వీధి దీపాల సమస్యలు పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం హౌసింగ్‌పై సమీక్ష చేసి లే అవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరిగేల ఎమినిటి కార్యదర్శులు, నోడల్ అధికారులు చొరవ చూపాలన్నారు. త్వరలో కాంట్రాక్టర్లతో లే అవుట్ ల వారీగా ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందరరామిరెడ్డి, కోటేశ్వరరావు, హౌసింగ్ ఈఈ శంకరరావు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

ఎస్‌హెచ్‌ఓ వీరసోమయ్య



పట్నంబజారు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వైవీ సోమయ్య తెలిపారు. పాతగుంటూరు పోలీసు స్టేషన్ పరిధిలోని సుద్దపల్లిడొంక ప్రాంతంలో మంగళవారం వారధి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ యువత పెడదోవ పట్టకుండా చక్కటి విద్యనభ్యసించి ముందుకు సాగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఏదైనా ఇతరత్ర ఘటనలు నెలకొన్నా పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎన్.సి.ప్రసాద్, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీకలవాగు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని పీకలవాగు వెంబడి కల్వర్టు, రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, పీకలవాగు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం కమిషనర్ దేవాపురం, కోబాల్ట్ పేట ప్రాంతాల్లో పర్యటించి పీకలవాగు కల్వర్ట్స్, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ దేవాపురం, కోబాల్ట్ పేటలో పీకలవాగుని పరిశీలించి, పలు ప్రాంతాల్లో కల్వర్ట్‌లు కూలిపోవడం చూసి తక్షణం అవసరమైన ప్రాంతాల్లో నూతన కల్వర్ట్‌లను రెయిలింగ్‌తో నిర్మాణం చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పీకలవాగు చుట్టూ పక్కల ఆక్రమణలు వాగులోకి వస్తున్నాయని, ఫలితంగా వర్షాల సమయంలో వాగు పొంగి ఇళ్లల్లోకి నీరు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్న రీత్యా వాగు పరిసరాల్లో ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను, మెయిన్ రోడ్ మీదకు ర్యాంప్‌లు, మెట్లు నిర్మాణం చేసిన వాటిని తొలగించాలని ప్లానింగ్ కార్యదర్శులకు సూచించారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ చేయాలని, రోడ్ల మీద, కాల్వల్లో వ్యర్థాలను వేసే వారిని గుర్తించి అపరాధ రుసుం విధించాలని చెప్పారు. కార్యదర్శులు సమన్వయంతో ప్రతి రోజు తమ సచివాలయం పరిధిలో క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. సిల్ట్ కార్మికులతో ఎప్పటికప్పుడు మేజర్ డ్రెయిన్లలో సిల్ట్ తీయించాలని, అవసరమైన ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ ద్వారా పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ బి.రాజలత, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ నాగభూషణం, ఏసీపీ రెహ్మాన్, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఆర్ఓ శివన్నారాయణ, స్పెషల్ శానిటేషన్ ప్రత్యేక అధికారి నిరంజన్, ఎస్.ఎస్.సోమశేఖర్ పాల్గొన్నారు.

ఐకమత్యానికి ప్రతీక గ్యార్మీ



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ఐకమత్యానికి గ్యార్మీ పండుగ ప్రతీక అని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా అన్నారు. మంగళవారం హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ జిలానీ మెహబూబ్ సుభాని దర్గా షరీఫ్ గ్యార్మీ జెండా పండుగ పురస్కరించుకుని 50వ డివిజన్‌లో రాష్ట్ర మైనార్టీ సంచారజాతుల డైరెక్టర్ మెహబూబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని నూరిఫాతిమా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మతసామరస్యం పెపొందే విధంగా వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ మొహమ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలని, ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు రాజేష్, భాగ్యలక్ష్మి, విజయ్, శ్రీక్రాంత్‌రెడ్డి, చంటి, సాంబ పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక ప్రార్థనల్లో నూరిఫాతిమా పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లో స్ట్రోక్ బాధితుడికి చికిత్స అందించాలి

డాక్టర్ ఉప్పటూరి అరుణకుమారి



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ ఉమాజ్యోతి

గుంటూరు మెడికల్: స్ట్రోక్ వచ్చిన బాధితుడికి నాలుగున్నర గంటల వ్యవధిలో గోల్డెన్ అవర్‌లో చికిత్స అందిస్తే స్ట్రోక్ తీవ్రతను వెంటనే తగ్గించవచ్చని గుంటూరు జీజీహెచ్ న్యూరాలజి విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు జీజీహెచ్‌లో న్యూరాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. ర్యాలీని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ ప్రారంభించారు. పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటం ద్వారా వ్యాధి బారిన పడకుండా వచ్చన్నారు. జీజీహెచ్ న్యూరాలజీ వైద్యులు స్ట్రోక్ బాధితులకు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని డాక్టర్ రమణ పేర్కొన్నారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు భవిష్యత్తులో విస్తృతంగా నిర్వహించాలన్నారు. డాక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ వ్యాధి గురించి వివరించి లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలని చెప్పారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ సత్యనారాయణ మూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ స్ట్రోక్ చికిత్సలో సర్జరీ ప్రాముఖ్యత గురించి వివరించారు. న్యూరాలజీ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ బిందున ర్మద, డాక్టర్ భార్గవి దేవి మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా స్ట్రోక్ బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు.

ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు



గుంటూరు మెడికల్: వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు 'స్ట్రోక్' పై ప్రజలకు అవగాహన కలిగించడానికి అక్టోబర్ 29న స్ట్రోక్ డే గా ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ప్రముఖ సీనియర్ న్యూరాలజిస్ట్, మేజర్ జనరల్ రిటైర్డ్ డాక్టర్ కుమార వేలు అన్నారు. మంగళవారం గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో డాక్టర్ కుమారవేలు మాట్లాడారు. 70 సంవత్సరాలు పైబడి లైఫ్ స్టయిల్ వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవిస్తున్న ఐదుగురు సీనియర్ సిటిజన్లు ఎ.శ్రీనివాస మూర్తి, వి.దివాకర్, మొహమ్మద్ షహదుల్ల, జి.వెంకటేశ్వరరావు, నీలాంబరంలను సన్మానించారు. వీరి స్ఫూర్తి తో యువత పక్షవాత వ్యాధి బారిన పడకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలని డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి తెలిపారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, న్యూరాలజిస్ట్ డాక్టర్ దీప్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: భార్య పుట్టింటికి వెళ్లిందనే మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగు మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. బాలాజీనగర్‌లో నివాసం ఉండే షేక్ మగ్బుల్‌బాషా(32) రాడ్‌బెడ్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన భార్య హసీనాతో మనస్పర్థలు రావడంతో ఆమె క్రోసూరులోని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన మగ్బుల్‌బాషా గడ్డిమందు తాగి జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పక్షవాతం నివారణకు అరగంట వ్యాయామం

డాక్టర్ పమిడిముక్కల విజయ



గుంటూరు మెడికల్: పక్షవాతం మనిషిని శాశ్వత కాలం అంగవైకల్యం బారిన పడేలా చేస్తుందని, ఒక్కోసారి ప్రాణాలు తీస్తుందని పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ న్యూరాలజిస్ట్, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎలక్ట్ డాక్టర్ పమిడిముక్కల విజయ అన్నారు. వరల్డ్ స్ట్రోక్ డే సందర్భంగా మంగళవారం గుంటూరు కొత్తపేటలోని లలితా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమాశంకర్ అధ్యక్షతన పక్షవాతంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ విజయ మాట్లాడుతూ మనిషిని నిర్వీర్యం చేసే జబ్బుల్లో పెరాలసిస్ మొదటి స్థానంలో ఉందన్నారు. వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం నలుగురిలో ఒకరికి జీవితకాలంలో పక్షవాతం వస్తుందని చెప్పారు. భారత దేశంలో ప్రతి 30 సెకన్లకు ఒకరికి పక్షవాతం వస్తున్నట్లు వెల్లడించారు. లక్షణాలు గమనించిన వెంటనే ఏమాత్రం ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్‌లో నాలుగున్నర గంటల్లోపు స్ట్రోక్ యూనిట్ ఉన్న హాస్పిటల్‌కు బాధితుడిని తీసుకెళ్లాలన్నారు. సీటీస్కాన్ చేసి ఇస్కిమిక్ స్ట్రోక్ నిర్ధారణ అయితే ఐవీ త్రాంబోలైటీస్ థెరఫీ ద్వారా క్లాట్ బస్టింగ్ డ్రగ్ ఇచ్చి బాధితుడిని సాధారణ స్థితికి తీసుకు రావచ్చన్నారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ ఉషాకిరణ్ మాట్లాడుతూ బ్రెయిన్ ఆరోగ్యంగా ఉండాలంటే హెల్దీ ఫుడ్ తీసుకోవాలన్నారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ టైమ్ ఈజ్ బ్రెయిన్ అని, ప్రతి నిమిషం విలువైనదని, ఆలస్యం చేయకుండా చికిత్సకు స్ట్రోక్ యూనిట్ ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. న్యూరో సర్జన్ డాక్టర్ కిరిటీ మాట్లాడుతూ బ్రెయిన్ హెమరైజ్ వచ్చిన వారికి ఆపరేషన్ ద్వార హెమరైజ్ తొలగించవచ్చు అన్నారు. న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ సంతోష్, పక్షవాత నిర్ధారణలో సిటీస్కాన్ ఆవశ్యకత గురించి, న్యూరోసైక్రియాటిస్ట్ డాక్టర్ అజయ్ ఒత్తిడిని తగ్గించడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చనే విషయాలను వివరించారు.

ముందస్తు జాగ్రత్తలతో పక్షవాతానికి అడ్డుకట్ట

న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.శరత్ చంద్రకుమార్



డాక్టర్ ఎన్.శరత్ చంద్రకుమార్

గుంటూరు మెడికల్: ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురులో ఒకరు పక్షవాతం బారిన పడుతున్నారని, ముందస్తు జాగ్రత్తల ద్వారా చాలామందిని వ్యాధి బారిన పడకుండా రక్షించవచ్చని న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎన్.శరత్ చంద్ర కుమార్ అన్నారు. మంగళవారం 'ప్రపంచ పక్షవాత నిరోధక దినోత్సవం' సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఓ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. 'పక్షవాతం- రకాలు- కారణాలు -లక్షణాలు, చికిత్స పద్ధతులు' అనే అంశంపై నిర్వహించిన శాస్త్రీయ అవగాహన సభలో డాక్టర్ శరత్ చంద్ర కుమార్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి అధ్యక్షత వహించారు. సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ మాట్లాడారు. సమావేశంలో ఎస్‌హెచ్‌ఓ మేనేజర్ పి.నిర్మల రాణి, ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మహమ్మద్ ఇమ్రాన్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, కార్యదర్శి సతీష్, కోశాధికారి టీవీ సాయిరాం, సభ్యులు సుబ్రహ్మణ్యం, శివాజీ సాంబశివరావు, చావా లక్ష్మి, విమల కుమారి, సాయికిరణ్ పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణకు అభినందనల వెల్లువ



డాక్టర్ రమణను అభినందిస్తున్న జనరల్ సర్జరీ వైద్యులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా ఉత్తర్వులు అందుకున్న ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణకు మంగళవారం పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది శాలువా కప్పి, బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఆస్పత్రిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తమ వంతు సహాయం అందజేస్తామని వైద్యులు వెల్లడించారు. అభినందనలు తెలిపిన వారిలో పలు వైద్య విభాగాధిపతులు, పలువురు వైద్యులు, మినిస్టీరియల్ ఉద్యోగులు, నర్సింగ్ యూనియన్ నేతలు, నర్సింగ్ అధికారులు, నర్సింగ్ సిబ్బంది, పలువురు బీజేపీ నేతలు, పలు బ్రాహ్మణ సంఘాల నేతలు, ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు, ప్రభుత్వ వైద్యుల సంఘం నేతలు ఉన్నారు.